## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సిబ్బందితో కలిసి ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. గత ఏడాది నుంచి కామారెడ్డి-సిరిసిల్ల రహదారి పై ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను ఆమె బుధవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, భవనాల అధికారులతో కలిసి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆమె వెంట కామారెడ్డిరూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్ ఉన్నారు.

## వాహనదారులకు జరిమానా



రోడ్డుపై నిలిపిన వాహనాన్ని తీసుకెళ్తున్న పోలీసులు

కామారెడ్డి, ఫిబ్రవరి 12 : జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్, సుభాష్, సిరిసిల్ల రోడ్డు, ఓల్డ్ ఎన్‌హెచ్ 7 రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలకు బుధవారం పోలీసులు మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం జరిమానా విధించామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు ఏఎస్పీ చైతన్యారెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై మహేశ్ సిబ్బందితో కలిసి మొత్తం 24 వాహనాలు ఇందులో 16 బైకులు, ఎనిమిది కార్లను సీజ్ చేసి, చలానా విధించినట్లు తెలిపారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్క్ చేయడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక మీదట ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉపాధిహామీ

## సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 12 : బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ బుధవారం తెలిపారు. 2023-2024 సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసిందని, వివరాలను మండల ప్రజావేదికలో వెల్లడిస్తారని తెలిపారు. ప్రజావేదికకు మండలానికి చెందిన ఉపాధిహామీ కూలీలు హాజరు కావాలని ఆయన సూచించారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనకు గురవుతున్న స్థానికులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 12 : బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు గ్రామంలోని బోర్లం క్యాంపు - బోర్లం ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభానికి బిగించిన విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామస్తులు, రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా బీటీ రోడ్డు ఎత్తు పెంచడంతో విద్యుత్ స్తంభానికి బిగించిన ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభం సైతం శిథిలావస్థకు చేరి నేలకొరిగే అవకాశం ఉంది. విద్యుత్ స్తంభం కింద భాగంలో కాంక్రిట్ వేసి పడిపోకుండా చేశారు. ఈ రోడ్డు గుండా విద్యుత్ సిబ్బంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి బిగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బోర్లం క్యాంపులో ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

మాచారెడ్డి, ఫిబ్రవరి 12 : కరెంట్ షాక్‌తో ఒకరు మృతిచెందిన ఘటన పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట గ్రామానికి చెందిన కుర్ర వెంకటి(25) ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం చెరుకు కొట్టడానికి ఆరెపల్లి గ్రామానికి వచ్చి గుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. చెరుకు కొట్టే పని పూర్తి కావడంతో గుడిసె విప్పుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం నుంచి గుడిసెకు ఉన్న విద్యుత్ వైరు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 12 : విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. బాన్సువాడ ప్రభుత్వ బాలికల కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను బుధవారం తనిఖీ చేశారు.

## ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి ఉషశ్రీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 12 : పాల్వంచ మండలంలోని సింగరాయిపల్లిలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అధికారిణి ఉషశ్రీ బుధవారం సందర్శించారు. ఆరోగ్య ఉపకేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న మందుల వివరాల గురించి ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో అన్నారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మరియా, సుప్రియా, యశోద ఉన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై అధికారులకు శిక్షణ



ఎన్నికల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 12 : త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై డివిజన్‌స్థాయి రిటర్నింగ్ అధికారులకు లక్ష్మీనర్సింహ కల్యాణ మండపంలో డీపీవో శ్రీనివాస్ బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీబీపేటకు చేరుకున్న కలాం స్ఫూర్తియాత్ర బస్

బీబీపేట్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతి పరిజ్ఞానంపై అవగాహన కల్పించి వారిలో ప్రయోగాలపై ఆసక్తి కలిగించేందుకు రూపొందించిన ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ బస్ బుధవారం బీబీపేటలోని టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేతలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువ సైంటిస్ట్ బృందం బస్ యాత్రలో వచ్చి శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థుల్లో ఆసక్తి, అభిరుచి పెంపొందించడానికి ఈ బస్ యాత్ర ఉపయోగపడుతుందన్నారు. పాఠ్య పుస్తకాల్లో లేని అంశాలను ఫ్లో బస్‌లో ప్రాక్టికల్‌గా చూపిస్తూ ఈ సాంకేతిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువ శాస్త్ర వేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యువ శాస్త్రవేత్త

## రేపు సబ్ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్

కామారెడ్డి, ఫిబ్రవరి 12 : వికారాబాద్‌లో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 34వ సబ్‌జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్ కోసం కామారెడ్డి జిల్లా కబడ్డీ జట్టుకు ఈ నెల 14వ తేదీ గాంధారిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్‌లో పాల్గొనే క్రీడాకారుల బరువు 55 కిలోల లోపు ఉండాలని తెలిపారు. క్రీడాకారులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాలా భాస్కర్ రెడ్డి 9398571110కు రిపోర్ట్ చేయాలని, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమోతో తప్పనిసరిగా రావాలని సూచించారు.

## 'విద్యారంగాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం'

కామారెడ్డి, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి కనీసం మంత్రిని కూడా నియమించలేదని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగం అస్తవ్యస్థంగా ఉందన్నారు. ఒక పక్క గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే మరో పక్క ప్రభుత్వ విద్యావ్యవస్థలో అర కొర వసతులు కల్పిస్తున్నదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సతీశ్, శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం

కామారెడ్డి, ఫిబ్రవరి 12 : కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామానికి చెందిన కొత్త రాజు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజు ఈ నెల 10న ఉదయం 8 గంటలకు కల్లు దుకాణంలో పని ఉందని చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత కామారెడ్డి పాత బస్టాండ్‌లో వారి గ్రామానికి చెందిన వ్యక్తులకు కనిపించగా ఎక్కడికి వెళ్తున్నావని అడిగితే పనిమీద వచ్చినట్లు తెలిపాడు. ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో అతని గురించి చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తున్నది. అతని భార్య కొత్త భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌లో లేదా 8712686145, 8712666242 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

### మానవత్వం చూపిన

## ప్రభుత్వ దవాఖాన సిబ్బంది



ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో అనారోగ్యంతో ఉన్న గుర్తుతెలియని మహిళకు సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: అనారోగ్యంతో ఉన్న గుర్తు తెలియన మహిళకు సేవలు చేసి మానవత్వం చాటుకున్నారు ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖాన సిబ్బంది. అనారోగ్యంతో రోడ్డుపక్కన ఉన్న గుర్తు తెలియని మహిళను వారం రోజుల క్రితం స్థానిక ఏఎస్సై విజయలక్ష్మి, పోలీసుల సాయంతో దవాఖానలో చేర్పించారు. అనారోగ్యం, ఏం తెలియని పరిస్థితిలో ఉన్న మహిళకు వైద్యులు, నర్సులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారం రోజులుగా చికిత్స అందించి సపర్యలు చేశారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, తన అడ్రస్ తెలపడంతో కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

## 'రామరాజ్యం పేరుతో రౌడీరాజ్యం'

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12: రామరాజ్యం పేరుతో రౌడీ రాజ్యం స్థాపించి దౌర్జన్యం చేస్తున్నారని ఎల్లారెడ్డి బ్రాహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు శ్రీధర్ శర్మ ఆరోపించారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో ఏర్పాటుచేసిన బ్రాహ్మణ వికాస పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం రామరాజ్యం అనే ప్రైవేట్ సైన్యంతో వీరరాఘవరెడ్డి చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సౌందర రాజన్‌పై భౌతిక దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి వారిని సమాజంలో తిరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ వికాస పరిషత్ ఉపాధ్యక్షుడు కొండంబొట్ల రాజేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌రావు, కోశాధికారి పటేల్ నర్సింహారావు, బ్రాహ్మణ వికాస పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆధార్, అపార్ ఎంట్రీలను త్వరగా పూర్తిచేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రాజు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని ప్రతి పాఠశాల ఆధార్, అపార్ ఎంట్రీలను త్వరగా పూర్తిచేయాలని డీఈవో రాజు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీ హెచ్ఎస్ (బాలుర)లో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూడైస్‌లోని ఖాళీలను తొందరగా పూర్తిచేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థుల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలి..**

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: ఎటువంటి భయం లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని డీఈవో రాజు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారని, గ్రేడింగ్ విధానాన్ని సైతం తొలగించారని పేర్కొన్నారు. మొత్తం 80 మార్కులకు వార్షిక పరీక్ష ఉంటుందని, 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయన్నారు. అలాగే మెమోరాండంపై పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ ప్రింట్ అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, పాఠశాల స్పెషలాఫీసర్ వీణ తదితరులున్నారు.



ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని మాచాపూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ ఫండ్స్ 5 లక్షల రూపాయలతో గ్రామంలో 120 మీటర్ల రోడ్డు పనులను మొదలుపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కుర్మ సాయిబాబా, యాసిన్, నారాగౌడ్, సామెల్, శ్రీనివాస్‌రెడ్డి, బొండ్ల సాయిలు, సుఖేందర్‌రెడ్డి, పడమటి సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్, కిరణ్, అశోక్‌రెడ్డి, యాదయ్య, రమేశ్‌గౌడ్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## '108'లో మహిళ ప్రసవం

గాంధారి, ఫిబ్రవరి 12: 108 అంబులెన్సులో మహిళ ప్రసవించింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంలక్ష్మణ్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి మానసకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. సిబ్బంది మహిళను గాంధారి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండంగా, నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యంలో ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది కమలాకర్, నరేశ్‌కు మానస కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. నూతన భవన నిర్మాణానికి 20లక్షల రూపాయలు మంజూరు అయినందున పనులను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

లింగంపేట, ఫిబ్రవరి12: మండలంలోని నల్లమడుగు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. గ్రామంలో అంతర్గత మురికి కాలువలు సక్రమంగా లేని కారణంగా మురుగు నీరంతా రహదారిపై ప్రవహిస్తున్నట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా డ్రైనేజీ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

## దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: దివ్యాంగ చిన్నారులకు పూర్తి అండగా భవిత కేంద్రాలు ఉంటాయని ఐఈఆర్‌పీ వెంకటేశం అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి భవిత భవనంలో ఫిజియోథెరపిస్ట్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరంలో ఎనిమిది మంది చిన్నారులకు వ్యాయామ వైద్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి భవిత భవనంలో దివ్యాంగ చిన్నారులకు వైద్యం చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ అరుణ్‌కుమార్

## బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

బిచ్కుంద, ఫిబ్రవరి12 : జుక్కల్ మండలంలోని లోంగన్ గ్రామానికి చెందిన మచ్కురి పండరి కొన్ని రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్న జుక్కల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసి బుధవారం బాధితుడికి ఎస్సై భువనేశ్వర్ ఫోన్ అందజేశారు.



పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న ఎస్సై భువనేశ్వర్

## యుద్ధభేరి ధర్నాను విజయవంతం చేయాలి



యుద్ధభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

లింగంపేట, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌లో మార్చి 2న నిర్వహించనున్న యుద్ధభేరి ధర్నాను విజయవంతం చేయాలని టీపీఎస్‌సీ పీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని శెట్పల్లి గ్రామంలో ఎంఈ వో షౌకత్‌అలీ, ఉపాధ్యాయులతో కలిసి బుధవారం యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, సభ్యులు రాము, రవి, శ్రీ నివాస్ గౌడ్, శ్రీకాంత్, రవిబాబు, రాజ్‌కుమార్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి12: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని రూ.10వేల జరిమానా విధించినట్లు నాగిరెడ్డిపేట ఎఫ్‌ఆర్‌వో వాసుదేవ్ బుధవారం తెలిపారు. మెదక్ జిల్లా ఘన్‌పూర్ మండలం రాజిరెడ్డి తండాకు చెందిన సోమ్లా తన ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను లింగంపేట మండలం లింగంపల్లి తరలిస్తుండగా పట్టుకుని, రూ.10వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

## ఎన్నికల శిక్షణకు వెళ్లిన అధికారులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి12: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి రైతు వేదికలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి మండలం నుంచి ఆయా శాఖల అధికారులు తరలివెళ్లారు. మండలం నుంచి 37 మంది రిటర్నింగ్ అధికారులుగా ఎంపికైనట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. వారికి బుధవారం ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు.

## 'సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

లింగంపేట, ఫిబ్రవరి12: గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని నల్లమడుగు పెద్దతండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15న సేవాలాల్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, సెలవు దినంగా ప్రకటించడం లేదన్నారు. సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

### నేడు స్థానిక ఎన్నికలపై

## మండల పార్టీల అధ్యక్షులతో సమావేశం

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 12: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక ఎన్నికలపై ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్ బుధవారం తెలిపారు. నూతన ఓటరు లిస్ట్, పోలింగ్ బూత్‌లపై వారికి వివరించి, గ్రామాల వారీగా జాబితాలను అందిస్తామన్నారు. ఉదయం 11 గంటల వరకు మండలంలోని ఆయా రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## ఆర్వోలకు శిక్షణా శిబిరం

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని మీసన్‌పల్లి గ్రామ రైతు వేదికలో ఎన్నికల శిక్షణలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి మండలాలకు చెందిన ఆర్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీవో సురేందర్ ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన పలు విషయాలను వారికి వివరించారు. సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు జారీచేయడం, పోలింగ్ సామగ్రిని ప్రిసైడింగ్ అధికారులకు అందించడం, పోలింగ్ సరళిపై నివేదికలు ఎలా పంపించాలి అనే విషయాలను ఆయన వివరించారు. సమావేశంలో డీఈవో రాజు, ఎంఈవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్లాటినం జూబ్లీ వేడుకలు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12: 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణంలోని సెక్షన్ కార్యాలయంలో బుధవారం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 సభ్యులు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ శశికాంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శి కాశీరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య, అదనపు కార్యదర్శి అమర్‌నాయక్, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.